# మెదక్‌లో 86.69 శాతం పోలింగ్

**పోలింగ్ శాతంలో రాష్ట్రంలోనే జిల్లాకు రెండో స్థానం**

- 2018లో జరిగిన ఎన్నికలకంటే తగ్గిన పోలింగ్ శాతం
- 4,40,341 మంది ఓటర్లకు 3,81,761 మంది ఓట్లేశారు
- పురుషులు 1,87,131, మహిళలు 1,94,627, ట్రాన్స్‌జెండర్లు ముగ్గురు
- మెదక్ నియోజకవర్గంలో 85.32 శాతం పోలింగ్
- నర్సాపూర్‌లో అత్యధికంగా 88.10 శాతం నమోదు



చిలిపిచెడ్: సోమక్కపేటలో ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు(ఫైల్)

మెదక్, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో పోలింగ్ 86.69 శాతం నమోదైంది. గత ఎన్నికల కన్నా కాస్త తగ్గింది. మొత్తానికి జిల్లాల వారీగా చూస్తే మెదక్ రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో 4,40,341 మంది ఓటర్లు ఉండగా 579 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. అందులో 3,81,761 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెదక్ నియోజకవర్గంలో 2,16,748 మంది ఓటర్లు ఉండగా, 1,84,915 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 89,695 మంది, 95,219 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు కాగా, ఒక్కరే ఓటు వేశారు. నర్సాపూర్ నియోజకవర్గంలో 2,23,593 మంది ఓటర్లు ఉండగా, 1,96,841 మంది ఓటర్లు ఓట్లు వేశారు. ఇందులో పురుషులు 97,436 మంది, మహిళలు 99,408 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు ఓటు వేశారు. మొత్తంగా 88.10 శాతం పోలింగ్ నమోదైంది.

**గంట గంటకూ పెరిగిన పోలింగ్**

మెదక్ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 86.69 శాతం పోలింగ్ నమోదైంది. మెదక్ నియోజకవర్గంలో ఉదయం 9 గంటలకు 9.99 శాతం నమోదు కాగా, 11 గంటల వరకు 30.11 శాతం, మధ్యాహ్నం ఒంటిగంట వరకు 50.62 శాతం, 3 గంటల వరకు 69.42 శాతం, 5 గంటల వరకు 85.32 శాతం నమోదైంది. నర్సాపూర్ నియోజకవర్గంలో ఉదయం 9 గంటల వరకు 9.01 పోలింగ్ శాతం నమోదు కాగా, 11 గంటల వరకు 30.42 శాతం, మధ్యాహ్నం ఒంటి గంట వరకు 50.97 శాతం నమోదైంది. 3 గంటల వరకు 69.24 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 88.10 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తంగా 86.69 శాతం పోలింగ్ నమోదైంది.

**జిల్లాలో తగ్గిన పోలింగ్ శాతం**

మెదక్ జిల్లాలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలున్నాయి. మెదక్ నియోజకవర్గంలో 2018 లో 85.87 శాతం, 2023లో 85.32 శాతం నమోదైంది. నర్సాపూర్ నియోజకవర్గంలో 2018 ఎన్నికల్లో 90.53 శాతం, 2023లో 88.10 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చి చూస్తే ఈసారి పోలింగ్ శాతం తగ్గింది. ప్రస్తుత జిల్లా పరిధిలోని మెదక్, నర్సాపూర్ రెండు నియోజక వర్గాల పరిధిలో కలిపి 4,40,341 మంది ఓటర్లు ఉండగా, 3,81,761 మంది ఓటింగులో పాల్గొన్నారు. మొత్తం 86.69 శాతంగా పోలింగ్ నమోదైంది.

**2018 ఎన్నికల్లో..**

2018లో మెదక్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,95,649 ఉండగా, 1,68,014 ఓట్లు పోలయ్యాయి. దీంతో 85.87 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో పురుషులు 94,088 మందికి 87,119 మంది ఓటేశారు. 85.97 పోలింగ్ శాతం నమోదైంది. మహిళలు 1,01,544 మంది ఓటర్లకు 80,895 ఓట్లు పోలయ్యాయి. 85.79 శాతం పోలింగ్ నమోదైంది. ఇతరులు 7 ఓట్లు కాగా, రెండు పోలయ్యాయి. నర్సాపూర్ నియోజకవర్గంలో 2,02,350 మందికి 1,83,184 ఓట్లు పోల్ కాగా 90.53 శాతం పోలింగ్ జరిగింది. ఇందులో పురుషులు 99,650 మందికి 91,494 మంది ఓటేశారు. 91 శాతం పోలింగ్ జరిగింది. 1,02,696 మహిళా ఓట్లు ఉండగా, 91,690 ఓట్లు పోలయ్యాయి. 89.28 శాతం పోలింగ్ నమోదైంది. ఇతరులు 4 ఓట్లు ఉండగా 2 ఓట్లు పోలయ్యాయి.

**2023 ఎన్నికల్లో...**

మెదక్ నియోజకవర్గంలో 2,16,748 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,03,654 మంది, మహిళలు 1,13,089 మంది ఉన్నారు. ఐదుగురు ఇతరులు ఉన్నారు. 1,84,920 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 89,685 మంది, మహిళలు 95,234 మంది ఓట్లు వేశారు. ఇతరులు ఒక్కరే తమ ఓటును వినియోగించుకున్నారు. మొత్తంగా మెదక్ నియోజకవర్గంలో 85.32 శాతం పోలింగ్ నమోదైంది. నర్సాపూర్ నియోజకవర్గంలో 2,23,593 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,09,240 మంది, మహిళలు 1,14,346 మంది ఉన్నారు. ఇతరులు ఏడుగురు ఉన్నారు. 97,436 మంది పురుషులు, 99,403 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇతరులు ఇద్దరు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 1,96,841 ఓట్లు పోలయ్యాయి. 88.10 శాతం పోలింగ్ నమోదైంది.

*ఈ నెల 3న ఓట్ల లెక్కింపు*

ఈ నెల 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మెదక్ జిల్లాలోని రెండు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు మెదక్ మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండలంలోని వైపీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగనున్నది. రెండు నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను భారీ బందోబస్తుతో ఈ కేంద్రానికి తరలించారు. కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను భద్రపరిచారు. స్ట్రాంగ్ రూం వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కోసం పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసే పనుల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

## ఓటెత్తిన మహిళలు

*రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో మహిళా ఓటర్లే పోలింగ్‌లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఓటింగ్ సరళిని బట్టి చూస్తే ఏ గ్రామంలో చూసిన మహిళా ఓటర్ల చైతన్యమే ఎక్కువగా కనిపించింది. నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాల్లో మహిళలే అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.*



మెదక్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళా ఓటర్లు(ఫైల్)

# కొండెక్కిన పండ్ల ధరలు

- తగ్గిన క్రయవిక్రయాలు
- ట్రాన్స్‌పోర్టు చార్జీలతో మరింత ప్రియమైన ఫలాలు
- పొద్దంత కూర్చున్నా కూలి పడని పరిస్థితి
- ఆందోళన చెందుతున్న వ్యాపారులు




రామాయంపేటలో కొనుగోలుదారులు లేక లేక వెలవెలబోతున్న పండ్ల దుకాణం

రామాయంపేట, డిసెంబర్ 1: నిత్యావసర వస్తువుల ధరలతో పాటు పండ్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నిండు ఆరోగ్యానికి రోజుకొక పండు తినాలనుకునే వారికి పండ్ల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. రేటు ఎంత పెరిగినా ఆరోగ్యంగా ఉండడానికి పండ్లు కొనక తప్పడం లేదు. రామాయంపేట పట్టణం జాతీయ రహదారి పక్కనే ఉండడంతో పండ్ల వ్యాపారం ఎక్కువగా జరుగుతున్నది. బస్సుల్లో వచ్చే ప్రయాణికులు బస్టాండు ఎదురుగా ఉండే దుకాణాల్లో పండ్లు కొనుగోలు చేస్తుంటారు. పండ్ల దిగుమతికి ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు ఎక్కువగా అవుతుండటంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

**తగ్గిన గిరాకీ.. పడని కూలి**

పండ్ల ధరలు విపరీతంగా పెరగడంతో విక్రయాలు లేవని పండ్ల వ్యాపారులు చెబుతున్నారు. జాతీయ రహదారికి కూతవేటు దూరంలో పట్టణానికి చేరుకోవడంతోనే పండ్ల బండ్లతో పాటు మొక్కజొన్న, దోసకాయలు, జామ, అరటి, యాపిల్స్ రకరకాల పండ్లు ఉన్నప్పటికీ వాటి రేట్లను చూసి ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేయడం లేదని వాపోతున్నారు. అన్ని కాలాల్లో అందుబాటులో ఉండే డజను అరటి పండ్లు రూ.50 పలుకుతున్నాయి. ఒక్క చిన్నసైజ్ యాపిల్ రూ.30 కాగా, ద్రాక్ష కిలోకి రూ.100 ఉంది. సపోట, ఆరెంజ్, బొప్పాయి, ఖర్బూజ రేట్లు కూడా పెరగడంతో పండ్లను కొనలేక ప్రజలు, వ్యాపారం సరిగా జరగక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.



### రేటు అడిగి వెళ్లిపోతున్నారు



రోడ్లపై పండ్ల బండ్ల వద్ద పొద్దంత కూసున్నా కూలి పడుతలేదు. పండ్లకు రేట్లు పెరగడంతో అంతంతమాత్రంగానే అమ్ముడవుతున్నాయి. బస్సులు, ఆటోలు దిగగానే పండ్లు కొనేందుకు వచ్చిన వారు రేటు అడిగి తిరిగి వెళ్లిపోతున్నారు. దీంతో గిరాకీ తగ్గిపోతున్నది. వ్యాపారం సరిగా సాగకపోవడంతో మధ్యాహ్నం పూట పండ్ల దుకాణాలను బంధు చేస్తున్నాం. అమ్ముడుపోక పండ్లు ఖరాబవుతున్నాయి.

– భండారి స్వరూప, వ్యాపారి రామాయంపేట

### రవాణా ఖర్చులు మీద పడ్తున్నాయి

స్థానికంగా పండ్లు లభించక ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నాం. పెరిగిన రేట్లతో సరిగా అమ్ముడుపోక ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు మీద పడ్తున్నాయి. పొద్దంత కూర్చొని అమ్మితే రోజు కూలి కూడా పడడం లేదు. స్థానికంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో పండ్ల తోటలు ఉంటే ధరలు ఇంత ఉండేవి కావు.

– రాజేశ్‌గౌడ్, పండ్ల వ్యాపారి, రామాయంపేట

### కొనలేక పోతున్నాం



కూరగాయలే అంటే పండ్ల రేట్లు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. రోజురోజుకూ చుక్కలనంటుతున్నాయి. పిల్లల కోసం పండ్లు కొందామని పోతే అనుకున్నదానికన్నా సగమే కొని ఇంటికొస్తున్నాం. రేటు బాగా చెప్తున్నరంటే ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు పెరుగుతున్నయని వ్యాపారులు అంటున్నరు. పండ్లు కొనాలంటేనే భయమేస్తున్నది. అయినా ఆరోగ్యం కోసం కొనక తప్పడంలేదు.

– మద్దెల వాణి, రామాయంపేట